# స్వర్గం

‘‘స్వర్గం బైనను, నరకం బైనను మన మనసే గాదా?’’ అనే రికార్డు, మేమున్న మేడమీదికి గాలి వాటానికి వినిపించేది. ఫిల్మ్ థియేటర్ వాడు జనాన్ని ఆకర్షించాలని సాయంకాలం అయిదు గంటలనించీ రికార్డ్సు పెట్టేవాడు. ఆరున్నరకి ఆట మొదలు. అందాకా వినబడేవి రకరకాల రికార్డ్సు. ఇప్పుడా రికార్డ్సు గుర్తొచ్చి నిజమేననిపించింది.

బాగా జబ్బు పడ్డాను. స్పృహ కోల్పోయే స్థితికి వెళ్లాను. తీవ్ర జ్వరం. సహజంగా ఆరోగ్యమైనదాన్నే. సీజన్‌కి వచ్చే దోమల కాట్లూ, బిపి పిల్సూ మంచాన పడేసినై. నా యిద్దరు బిడ్డలేమౌతారో అని ఆరాటం జ్వర తీవ్రత వల్ల కలిగింది. రెగ్యులర్ ఫీడింగ్ జరక్కపోతే లివర్ దెబ్బ తింటుంది. చిరుతిండి తినగూడదని తెలియదు. దగ్గు పట్టుకుంటుందని తెలియదు. ఇద్దరూ నాలుగేళ్ల లోపువాళ్లే.

తెలివి వచ్చినప్పుడు చూస్తే, అక్క పండురసం గ్లాసెడు గ్లాసెడు అందిస్తున్నది పిల్లలకి తనూ తాగుతున్నది. పిల్లవాడు నెట్టేస్తున్నాడు గానీ పిల్లకు తెలియక తాగుతున్నది.

‘‘అలా వేళాపాళా లేకుండా వాళ్ల పొట్టలో యేదో ఒకటి పొయ్యకు. అన్నీ తినిపించకు. లివర్ వ్యాధి వస్తుంది’’ అన్నా. అక్క నవ్వి లేచిపోయింది.

జ్వర తీవ్రత వల్ల యేమీ తాగలేను. వాంతులౌతున్నాయి. క్రమంగా మగత యేర్పడ్డది. సగం తెలివి వుంటుంది. సగం వుండదు.

సాయంపట్టి నడిపిస్తున్నట్టున్నది. బండి కుదుపు. రైలు కూత వినిపించింది. చక్రాల చప్పుడు. తెలివి తప్పింది.

2

జ్వరం జారిందేమో తెలివి వచ్చి కళ్లు విప్పి చూశాను. పెత్తల్లి తనకానించుకుని మంచం మీద కూచుని బతిమాలుతున్నది.

''అమ్మా! లలితా! గ్లూకోజ్ నీళ్లు తాగు. ధారకం లేదు. ఇంజెక్షనిచ్చి వెళ్లాడు డాక్టరు. తాపానికి తట్టుకోవద్దా? చక్కల వంట జరం. ఆశ వదులుకున్నాం. యెలాగో అమ్మవారి దయవల్ల, మంచి డాక్టరు సమయానికందాడు. బతికావు. మలేరియా అన్నాడు. కడుపులో చిన్న బిళ్ల కట్టిందట. యేమీ యిమడటం లేదు. ఇవాళ తీవ్రత తగ్గింది. నూట వకటికి దిగింది జరం. లివరూ సరిగా పనిచేయటం లేదన్నాడు'' అంటున్నది.

కళ్లు బాగా విప్పి చుట్టూ చూడగలిగాను. నులకమంచం మీద నా పాత చీర వేసి పడుకోబెట్టారు. దిండు లేదు. పక్కగా నేలమీద చిరిచాప. దాని మీద పిల్లలిద్దరూ వత్తిగిలి పడుకుని నిద్రబోతున్నారు. మీద దుప్పటన్నా లేదు.

పెత్తల్లి గ్లూకోజ్ నీళ్లు తాగించి లేచి వెళ్లింది. గ్లాసు కడగాలి. వయసులోవున్నా గదూ పాతికేళ్లే. కాళ్లు కింద వుంచి లేచాను. గోడవారగా నా పెట్టె కంటబడింది. రాత్రి అని తెలిసింది చిన్న బెడ్‌లైట్ వెలుగుతున్నది కుర్చీ పీటమీద. పెట్టెకు తాళం లేదు. లేచివెళ్లి పెట్టె మూత తీసి నావి రెండు యిస్త్రీ చీరలు తీసి తెచ్చాను. పిల్లల్ని పక్కకి జరిపి ఒక చీర పక్కకి వేశాను. యిద్దర్నీ దాని మీదకి జరిపాను. రెండో చీర కప్పాను. నీరసం వల్ల కూచో లేకపోయాను. వెళ్లి మంచం మీద వాలాను.

పెత్తల్లి బంగారమ్మ వచ్చి చూసి నవ్వుతూ అన్నది. ''మమకారం అలా చేయిస్తుందే తల్లీ. అప్పుడే లేచావు. ఇంకా జరం అంతా జారలేదు. కాఫీ తాగగలవా? మెత్తగా వుప్మా తినాలని వున్నదా?'' అన్నది. కడిగి తెచ్చిన గ్లాసు కుర్చీ పీట మీద బోర్లించి పిల్లల పక్కగా కూచున్నది.

''యేం వద్దక్కయ్యా. తెల్లారనీ, ఒంటిగంట అయిందేమో. అప్పటికి పూర్తిగా జరం జారిపోవచ్చు. నా కోసం మేలుకుని వున్నావా? మా అమ్మలేదూ? అక్కలేదూ?'' అన్నా.

మేము పెత్తల్లినీ, పింతల్లినీ గూడా అక్కయ్యా అనే పిలుస్తాము. అలా అలవాటు చేశారు మా వాళ్లు. అదొక నాగరకత.

పెత్తల్లి తలకింద చేయిపెట్టుకుని పిల్లల పక్కగా పడుకున్నది. పెదనాన్న పోయినాడు పదేళ్లయింది. కావి ధోవతి. రవిక వేసుకోదు. మూలగా మూకుడు లోంచి సన్నని పొగ పైకిలేచి పైగా తిరుగుతున్నది. ఊక కాలుతున్న వాసన.

''చెపితే వింటేనా మీ అమ్మ? పలవరిస్తున్నది లలిత. వదిలి వెళ్లకే అంటే దులపరించి వెళ్లిపోయింది. మీ నాన్న వంతు వచ్చిన కొద్ది పొలం యిక్కడికి అయిదు మైళ్ల దూరంలో వున్న కుంచవరం గ్రామంలో వున్నది. నడిచివెళ్లి రైతునడిగి డబ్బు తెస్తుందిట. చెప్పింది. నీ పిల్లలిద్దరూ యేడవకుండా కొత్త లేకుండా, ''అమ్మమ్మా'' అని పిలుస్తూ కూడా తిరిగారు. పెట్టింది తిని ఆడుకున్నారు. అల్లరే లేదు. మీ అక్కేమో మేనమామను చూసి వస్తాను. లేవటం లేదన్నారు అని వెళ్లింది'' అని చెప్తూ కళ్లు మూసుకుని నిద్రలోకి జారింది పెత్తల్లి.

జ్వరం జారి చెమటలు పోసి మంచి నిద్రబట్టింది. తెల్లగా తెల్లారి మెళుకువ వచ్చింది.

పెత్తల్లి అప్పుడే కాలకృత్యాలు తీర్చుకుని, వీధి చిమ్మి కల్లాపు చల్లి ముగ్గు వేసి లోపలికొచ్చింది. పొయ్యి ముట్టించి ఉప్మా చేసింది. ఘుమ ఘుమలాడుతూ వాసన వచ్చింది. నీళ్లకాగు పొయ్యి మీదుంచింది. నా దగ్గర కొచ్చింది.

''అమ్మా! లేచి మొహం కడుక్కో. గొల్ల గౌరమ్మ పాలు తెచ్చి పోసిపోయింది. కాఫీ డికాషన్ దిగింది. యెంత తీసేశావే తల్లీ! పాలిపోయావు''అన్నదాపేక్షగా.

''జ్వరం కాచి పోసింది'' అని లేచాను''. పిల్లల చేత మొహాలు కడిగించి, పాల గ్లాసు లిచ్చి, ఆకుల్లో ఉప్మా పెట్టి యెదుట వుంచింది పెత్తల్లి. తిని పాలు తాగి పోయి యింటి పక్కన పిల్లలతో ఆడుతున్నారు.

పెత్తల్లి తాటాకు, పళ్ల పొడీ యిచ్చింది. దొడ్లో ముఖం కడుక్కొని వచ్చి మంచం మీద కూచున్నా. యెండు తామరాకులో యిడ్లీలు రెండు, కొంచెం వుప్మా, నెయ్యి వేసి యెదుట వుంచింది పెత్తల్లి. మంచి నీళ్ల గ్లాసూ, కారప్పొడి

గిన్నె, అల్లం పచ్చడి గిన్నె దగ్గరుంచింది.

కింద కూచుని తిన్నా. యెంత రుచి! జిహ్వ లేచి వచ్చింది. ఆకులు పారేసి చేయి కడుక్కుని తుడుచుకుంటూ వచ్చి, ''కాఫీ వద్దక్కయ్యా, నా కలవాటు లేదు'' అన్నా.

''అరకప్పు వేడి కాఫీ తాగమ్మా. టిఫిన్ అరగద్దూ'' అంటూ కింద కూచుని మెల్లిగా తాగించింది పెత్తల్లి. దయగల తల్లి అమ్మవారల్లే తోచింది.

అన్న సుబ్రహ్మణ్యం వచ్చాడు. యెనిమిది కావస్తున్నది.

''లలితా! డాక్టరు వస్తాడు. ఇంజెక్షనివ్వాలిట. జరం జారినట్టున్నదే? మొహం పొంగి యెర్రగా లేదు. తేటగా వున్నది'' అంటూ వంటింట్లో కెళ్లాడు.

ఇల్లు అంటే, వెదురు తడికలతో కట్టి, పేడా మన్నూ కలిపి పూస్తే పల్చని గోడలల్లే వుంటాయి. గాలిలోపలికి రాకుండా పెత్తల్లి చెందడులాగా మందంగా మట్టీ పేడా కలిపి పూస్తుంది కింది వరకు గోడలాగా. మట్టీ గులకరాళ్లూ సన్నని కంకరా కలిపి కడతారు. యెత్తుగా మట్టిపోసింది దానిపై కట్టటం వల్ల వాన నీరు లోపలికి రాదు.

దీర్ఘ చతురస్రం లాగా ఒక గదీ, మధ్య హాలు, వంటిల్లూ అంతే. తడిక తలుపులే. వెనక దొడ్డి. వాసాలు నిలబెట్టి తడి కప్పు వేసి, తాటాకులేసి, బొంగులేసి తాటినారతో బిగించి మట్టిపోసి మళ్లా ఆకులేసి మట్టిపోసి బరువుగా రాళ్లుంచితే అది కప్పు.

అన్నేం చేస్తున్నాడో, వీడే నా మీద చాలా నిందలు వేశాడని విన్నా, అయినా చూతామని మెల్లిగా వెళ్లి వాకిలి ఆనుకుని నిలబడి చూశా.

చిన్నపీట మీదున్నాడు. తామరాకులో రెండు యిడ్లీలు, ఉప్మా, కారప్పొడి, అల్లం పచ్చడీ. పక్కన మంచి నీళ్ల గ్లాసూ, అన్న నెయ్యి వేసుకోడు. చాలా ఖరీదుట. అదో రకం నూనె. దాని పేరు మారువా నెయ్యి. అది గూడా కారప్పొడి లోపల గరిటెడు వేసి కలిపి తినేస్తున్నాడు. మంచినీళ్లు తాగి పళ్లెంలో చెయ్యి కడుక్కుని

లేచి తానే టీ చేశాడు. పొంగే నీళ్ల టీ ఆకు వున్న గ్లాసులో పోస్తే టీ డికాషన్ తయారైంది. వలలాగా వున్న గరిట సాయంతో గాజు గ్లాసులోకి వడగట్టాడు. టీ స్పూన్ పాలు పోసి రెండు చెంచాల పంచదార వేసి గరిటతో తిప్పి తాగుతున్నాడు. స్ట్రాంగ్ టీ. ముదురు రంగు డికాషన్.

'' ఇంకాసిని పాలు పోసుకోవా? మరీ తక్కువ పోసి తాగితే చేదుగదూ అన్నయ్యా'' అనడిగా.

''తాగి చూడు లలితా. బలే వుషారొస్తుంది. పాలు యెక్కువ పోస్తే వేరే రుచి. తల దిమ్మెక్కుతుంది'' అని నవ్వాడు. అన్న లేచాడు. ఇద్దరం మధ్య గదిలో కొచ్చాం. వాకిలి నానుకుని నిలబడి ఒక పాతికేళ్లమ్మాయి కంటబడింది. వాయిల్ చీరా, జాకెట్టూ. జడా. బొట్టూ లేదు. బంగారు నగలే కాసిని ఒంటి మీదున్నాయి. చామన చాయ.

'' ఉమా! పరీక్ష చెట్టెక్కిందా? వుద్యోగం వెలిగిస్తూ నీ అంతట నువ్వు చదవలేవనీ, ట్యూషన్ పెట్టుకోవాలనీ చెప్పానా? ఫెయిలయ్యాక నేను గుర్తు వచ్చానా? అదీ మంచిదే యిప్పటికైనా గుర్తించావు'' వీడేమిటి పట్టభద్రుడన్నా గాదు, నాకేం చెప్పగలడని తూస్కరించావు. నాకు డిగ్రీ లేకపోతేనేం మా ట్యుటోరియల్ కాలేజీలో మంచి పేరే వున్నది. మా కాలేజీ పిల్లలు పరీక్షకూర్చుని యెనభై శాతం నెగ్గారు. కాఫీ కావాలా? ఒక్కత్తెవే వచ్చావా?'' అని అంటూ పక్కగా వెళ్లి వీధిలోకి తొంగి చూశాడన్న. కొద్ది దూరంలో తోలు పెట్టె కంటబడింది పొద్దుటి యెండలో. నవ్వుతూ వెళ్లి పెట్టె అందుకుని లోపలికి తెచ్చాడన్న.

''పద. స్నానం చేస్తావా? టిఫినున్నది. అమ్మ బొటాబొటిగా చేయదు. దండిగానే చేస్తుంది. మనమలూ మనుమరాళ్లూ వస్తారని, ఆకలితో వస్తారని తినటానికేమైనా వున్నదేమోనని చూస్తారని మరింత చేస్తుంది. కళ్ల నీళ్లెందుకే ఉమా? నే చూస్తాగా నీ సంగతి. సెప్టెంబరుకి ఒడ్డెక్కిస్తా''.

నన్ను చూపించాడన్న ''దీనిపేరు లలిత, నీకాడపడుచౌతుంది. డాక్టరుని సంప్రతించకుండా తానే వైద్యం చేసుకుని, వ్యాధిని ముదరనిచ్చింది. సంధించిందని భయపడి మా పింతల్లి అనుమాయమ్మ తన చెల్లెలు చూడవస్తే దాని సాయంతో అతి కష్టం మీద యిక్కడకి తెచ్చింది దీన్ని. నేనప్పుడే పరుగెత్తికెల్లి నా ఫ్రెండ్ ప్రైవేట్ ప్రాక్టీషనర్ని డాక్టర్ రామగోపాల్ని తెచ్చా. తెలివిగలవాడు. కాని మంచి ఆదాయం లేదు. జబ్బేమిటో యిట్టే కనిబెట్టి తగిన మందు వాడతాడు రామగోపాల్. జబ్బుని తరిమేస్తాడు. చూడు లలిత అప్పుడే లేచి నించుంది. నిన్న తెలివి లేదు దీనికి''.

ఉమని స్నానానికి తరిమాడు అన్న. పైన కప్పు లేకపోయినా అవతలివారు కనిపించరు.

మరునాడు ఉమ నాతో చెలిమి చేసి, పని అందుకున్నది. పెత్తల్లికి పనిచేసి పెట్టాము. పెత్తల్లిని అమ్మమ్మగారూ అని పిలుస్తుంది ఉమ. వంటింట్లోకి రాదు. మధ్య గదిలో భోజనం కానిస్తుంది. అంట్లు తోమి కడిగి బోర్లిస్తుంది. బట్టలుతికి ఆరేస్తుంది. ఆరాక తాకదు.

దోసకాయలు చెక్కు తీస్తున్న ఉమని నేను నవ్వుతూ చూశాను. గ్రహించింది.

''నేనండీ వదిన గారూ! బి.సి. పద్మసాలీలు, బొందిలీలు, విశ్వబ్రాహ్మల పేర్లు విన్నారా? ఆ వర్గం అన్నమాట''.

''అమ్మమ్మగారు పూజ చేసి నైవేద్యం పెడ్తారు. అందుకని అటుపోను. టీచరు చేస్తున్నా. ప్రైవేట్‌గా మెట్రికు్క యింటరూ, బియె పాసై యల్టీగానీ బియిడి గానీ కానిస్తే హైస్కూల్లో వుద్యోగం వస్తుందని ప్రైవేట్‌గా పరీక్షలు రాయాలని వుద్దేశం. చిన్నప్పుడే పెల్లి చేశారు. అత్తింటికీ తోలారు గానీ దొంగలు నగలెత్తుకుపోతుంటే అటకాయించాడని నా మొగుణ్ణి చంపేశారు. మళ్లా అంత మంచివాడేడీ? అందుకని ట్రెయినింగై టీచరునైనా''.

ఇంటి ముందు పల్లం. వాన నీరు నిలిచింది. మరికొద్ది దూరంలో పందులను కాస్తూ మేపి మంచి ధరకమ్మేవాళ్లు చుట్టూ గుడిశల్లో వున్నారు. పంది పిల్లలు ఆ నీళ్ల గుంటలో దిగి ఆడతాయి. ఒడ్డెక్కి ఒక దానిమీద ఒకటి పడుతూ పరుగెత్తుతాయి. పిల్లలిద్దరూ మెట్టు మీద నిలబడి వాటిని చూసి ఆనందిస్తున్నారు.

కుడివేపుగా మరికొద్ది దూరంలో దాయాది అత్తయ్య లోపలికి పోయింది.

పందిపిల్లలు తల్లి దగ్గర కెళ్లిపోయాయి. పెద్దపంది తవ్వి యేదో తింటున్నది. యివి గూడా తవ్వి యేవో తింటున్నాయి. వింత చూసి పిల్లలిద్దరూ లోపలికెళ్లిపోయారు.

''అక్కయ్యా! వీళ్లిద్దరికీ తలంటు పోయాలి. మట్టికొట్టుకున్నది. గుడ్డలు బాగా మాశాయి'' అని లేచింది లలిత.

ఉమ దోస ముక్కల పళ్లెం, ములక్కాడ ముక్కలు వుల్లిపాయ ముక్కలు, అరిటికాయ ముక్కల గిన్నె అన్నీ తడిక పక్కగా పెట్టింది.

''నే తలంటి పోస్తా వదిన గారూ, కంట్లోకి కుంకుడు నురగ పోకుండా చిన్న టవల్ అడ్డం కట్టి పోస్తా. పేర్లేమిటీ?'' అని లేచిపోయి దొడ్లో, మూడు రాళ్ల మీదున్న కాగులో నీళ్లు పోసి కింద మంట వేసింది.

పెత్తల్లి అట్లా వెళ్లి చిన్న సీసాతో నూనె, కుంకుడు కాయల పొట్లం తెచ్చి కిందవుంచింది. సున్ని పిండి పళ్లెంలో పోసి దగ్గర పెట్టింది.

''అమ్మా లలితా! పచ్చం తినాలి. చారూ, బీరకాయ యిగురు, పాత చింతకాయ పచ్చడీ, పాత వుసిరికపచ్చడి, వేసుకుని తినాలి. జరం కాచి పోసింది గదూ. అన్నకోశం బాగుపడాలి. నోరు చేదెక్కి, రుచిపోయి వుంటుంది. నువ్వు గూడా స్నానం కానీ'' అని లోపలికెళ్లింది.

నిరుపమం నూనె రాయించుకుని, తలంటించుకుని, నలుగు పెట్టించుకున్నది. ఉమ నవ్వుతూ పిట్ట కథలు చెపుతూ నలుగు ఆరాక, సున్నిపిండి రాల్చి తలకుపోసి, ఒళ్లు అద్దింది.

‘‘పోయి అమ్మ చేత వుతికిన గుడ్డ వేయించుకో’’ అన్నది.

రఘు మాత్రం బాగా అల్లరి చేస్తూ అందకుండా పరుగెత్తుతూ, ‘‘తలంటి వద్దు అత్తయ్యా! ఒట్టి నీళ్ల పొయ్యి’’ అని నవ్వుతుంటే, ఉమ, ‘‘కంట్లోకి నురగపోకుండా పోస్తా. నిమిషంలో తలంటి పోస్తా. తరవాత నువే చెంబుతో నీళ్ల ముంచి, ఒంటిమీద పోసుకుంటూ ఆనందిద్దువు గాని. రా’’ అని పట్టుకోవాలని వాడివెంట పరుగెత్తింది.

‘‘చెడ్డీ విప్పడుట వదిన గారూ. అప్పుడే చాలా పెద్దవాడినైనానని అనుకుంటున్నాడు రఘు’’ యెలాగైతేనేం పట్టుకున్నది. ‘‘పోనీ చెడ్డీ విప్పద్దులే. దాంతోనే స్నానం చేయి పరుగెత్తకు. నీళ్లు చల్లారి పోతున్నాయి. నిమిషంలో పోస్తా’’ అని కుర్చీ పీట మీద కూచోబెట్టి, తలకు నూనె రాచి, వంటికి నలుగు పెట్టింది. కథలూ కబుర్లూ చెప్తూ తలంటు పూర్తి చేసింది ఉమ.

‘‘ ఇవుగో బకెట్ నిండా నీళ్లు. ఇదుగో చెంబు. నువ్వే పోసుకో యిహ. నేనిక్కడ రాతి మీద కూచుంటా. స్నానమయాక తల తుడవాలి పౌడరద్దాలి. సాంబ్రాణీ పొగ వేయాలి’’.

‘‘పొగ యెందుకూ?’’ నెత్తిన నీళ్లు కుమ్మరించుకుంటూ అడిగాడు రఘు.

‘‘జుట్టు త్వరగా ఆరుతుంది. తలకి మంచి వాసన పడుతుంది. వళ్లు వెచ్చగా వుంటుంది. జలుబు చేయదు’’.

బకెట్ నీళ్లూ పూర్తి చేసి రఘు పరుగెత్తాడు. ‘‘అత్తా! పట్టుకో. పట్టుకో’’ అని కేక వేశాడు.

గభిక్కిన లేచి వాడి వెంట పరెగెత్తింది ఉమ. ఆయాసపడి పట్టేసింది. వాళ్లిద్దరి ఆటచూసి లలిత నవ్వింది.

అన్న సుబ్రహ్మణ్యం కేక వేశాడు. ‘‘ ఉమా! ట్యుటోరియల్ కాలేజీకి రావాలి. ఫీజు కట్టాలి. అన్ని సబ్జక్ట్సు చెప్పాలా లెక్కలొక్కటేనా? అది తెలియాలి. లెక్కలొక్కటే అయితే స్పెషల్ క్లాస్ తీసుకుంటారు. ఒక గంట

చాలు. ఇంటి కొచ్చేయచ్చు. పిల్లలతో ఆడుకోటానికా వచ్చావూ? తయారు కావాలి''.

'' ఆడుకోటానికి రాలేదు మామయ్యగారూ. వచ్చేస్తున్నా. మొత్తం పరీక్ష వ్రాయాలి. డబ్బు తెచ్చా. ఫీజు కట్టేస్తా'' ఉమ జడ ముందుకేసుకుని చివరలు అల్లుకుంటూ వచ్చింది.

''అమ్మమ్మగారూ! యీ మాటు పరీక్ష నెగ్గాలని దీవించండి. పాదాలకి దణ్ణం పెడతా. ఆకనులెండి. ధోవతుల చాపు తెచ్చాను. భోజనమయాక కట్టుకోండి''

''యెందుకు నెగ్గవే పిచ్చి సన్నాసీ! మామయ్యను నమ్ముకున్నావుగా'. పాసయి, నీ నంబరు పేపర్లో చూసుకుంటావు యీ మాటు'' అంటూ వచ్చింది పెత్తల్లి బంగారమ్మ.

3

ఉమ లలిత సాయంతో లెక్కలు సాధన చేస్తున్నది. మధ్య మధ్య వీధివేపు చూస్తున్నది.

''అక్కడేమున్నది వదినగారూ? లెక్కల మీదే దృష్టి వుంచాలి. లెక్కలే రావటం లేదంటిరి'' అన్నది లలిత.

'' ఇంటి ముందు నీటి మడుగులో పంది పిల్లలు ఆడి ఒడ్డుకొచ్చి ఒకదాని మీద ఒకటిపడి పరెగెత్తుతుంటే, పిల్లలిద్దరూ వినోదిస్తున్నారు. బాబు చిల్లపెంకు అందుకుని వాటంగా నీళ్ల మీదికి విసిరితే, అది కప్పు గంతులేస్తూ వెళ్లింది. చప్పట్లు కొట్టి నవ్వుతున్నాడు'' అన్నది ఉమ.

''ఏదీ? గ్రాఫ్ మీద లెక్కలు గీయటం గుర్తుపెట్టటం వచ్చిందా చూడాలి. గ్రాఫ్ పేపరిదుగో''.

ఉమ పేపర్ వంకే చూస్తూ గుర్తులుంచుతూ గీతలు గీస్తున్నది పెన్సిల్‌తో.

సరీగ్గా ఆ సమయంలో పెత్తల్లి బంగారమ్మ పెద్ద కూతురు శేషమాంబ

వాకిట్లో వెలిసింది. ఉమ తలెత్తి చూసి మళ్లా లెక్కలు గీస్తున్నది. శేషమాంబ ఉమని చూసింది.

''మళ్లా పోగుబడ్డావూ? నా తమ్ముడు తప్పితే నీకు మరో ట్యూటరందలేదా? చదువు మిష పెట్టి యింట్లో చేరుతావు. పరీక్ష తగలేశావాయేం? కావాలనే తగలేశావేమో. ఇక్కడ చేరితే మా అమ్మ నీకు రుచి పాకాలు వండిపెడుతుంది. వండుకు తినలేవూ? మా అమ్మ నీకెందుకు వండి వడ్డించాలీ?'' అంటూ లోపలికొచ్చి నిలబడి ఉమ యేమి చేస్తున్నదో చూస్తూ నిలబడింది.

''మీరంతా రావటం లేదూ? మీ అందరికీ అమ్మమ్మగారే వండి వడ్డిస్తున్నారు. నేను సాయంగానే వున్నానే? తిని ఆడుకుంటున్నానా? మొగుడితో లడాయి వేసుకుని అలిగిరా లేదు. బెదిరించటానికీ రాలేదు. నన్ను మామయ్యగారూ అమ్మమ్మగారూ ముద్దు చేస్తారని కడుపులో మంట'' అన్నది తలెత్తకుండానే.

''గురివింద గింజ తన నలుపెరగదుట. నన్ను యెద్దేవా చేసేదానివా నువ్వా? యేం మాస్టరుగారనలేవూ? నా తమ్ముడు నీకు మామయ్య అయినాడూ? మా అమ్మ అమ్మమ్మ అయిందీ? బాగుంది వరస. యెవరు నేర్పారే అలా వరస కలపమనీ? బంగారం కాజేసేవారా? దర్జీకి గుడ్డ యిచ్చి కుట్టమంటే ముందే కొంత కత్తిరించి తీసి అవతలుంచుకుని గుడ్డ చాలదంటాడుట. టంకమని రాగి కలుపుతారే మీ వాళ్లు. పుట్టింటికొస్తే తప్పా? పరాయింట్లో మేస్తే రైటా?'' అని వురిమింది శేషమాంబ.

ఉమ చివ్వున లేచి నిలబడింది ''నేమెయ్యటం లేదు. మాటలు తిన్నగా రానీండి. నా ఖర్చుగాక యింటి ఖర్చూ భరిస్తున్నాను. అమ్మమ్మ గారూ! నన్ను తరిమేయటానికొచ్చారు మీ అమ్మాయి. జెలసీ. మీరు దయగా చూస్తారనే దిలాసాతో వచ్చా. ఈమె వూడిపడింది. స్వభావానికి తగ్గదే పేరు. పడగ విప్పి కాటువేయాలని చూసే పాములాగా చూస్తున్నారు. పోతున్నా'' అంటూ వీధిలోకి

పరెగెత్తింది. తలముడి వూడింది. పెత్తల్లి బంగారమ్మ పూజ కాలేదు. కులదైవానికి నీరాజనమిస్తున్నది. లేచి రాలేదు.

లలిత లేచి ఉమను తేవాలని వెంటబడింది.

''అదెక్కడికి పోతుందే చెల్లెలా? బెదిరిస్తున్నది. నా తమ్ముడిని తనిష్టమొచ్చినట్టు ఆడించదా్దా? పోతుందా? పోతే మంచిదే పీడ విరగడౌతుంది. నువ్వు వెనక్కిరా లలితా!''

దగ్గర్లోనే పంట కాలవ ప్రవహిస్తున్నది. ఒడ్డెక్కింది ఉమ. లలితపరుగెత్తుకెళ్లి లాక్కొస్తున్నది.

కొంత దూరం వచ్చిన శేషుమాంబ 'పడనీవే లలితా. టక్కులు చూపి మగవాళ్లను భ్రష్టులను చేస్తున్నది. యెంతమంది విటులో?'' అని హేలనగా నవ్వింది.

''రోజూ కీచులాడుకునే కన్న అదే మంచిది గదూ'' అని యేడుపందుకున్నది ఉమ.

''మాటకు మాట అంటిస్తున్నావే? వుండు నీ కివాళ శాస్తి చేస్తా'' నంటూరివ్వున వచ్చి ఉమ జుట్టు పట్టుకుని వంగదీసి కొట్టబోయింది శేషుమాంబ. లలిత ఉమను లాగి తాను అడ్డుపడింది. దెబ్బలు తిన్నది ఉమ నిలబడి కన్నీళ్లు కారుస్తూనే నవ్వింది. శేషుమాంబ నివ్వెరపోయింది.

'పగవున్న చోట అంటే, ప్రేమ వున్నచోట తాకుతుందిట అది నిజమైంది'' అన్నది ఉమ.

''నువ్వెందుకే అడ్డుపడి దెబ్బలు తిన్నావూ అనవసరంగా'' అన్నది శేషుమాంబ.

నిలబడిన లలిత అన్నది ''వదిన్ని అన్న మాటలు నాకూ వర్తిస్తాయి. నేనూ అవే మాటలు పడ్డా. దెబ్బలు తినలేదనుకో శేషు అక్కా. నిజం చూస్తే దెబ్బలే బాగున్నాయి. అన్న సుబ్రహ్మణ్యం చేసిన ప్రచారం చెప్పనా? ఆ నిందల

కన్న యీ దెబ్బలు బాధ కలిగించలేదు'' అన్నది లలిత.

పెత్తల్లి బంగారమ్మ వచ్చి వాకిట్లో నిలబడి పిలిచింది.

''శేషూ! నైవేద్యమైంది. వేడినీళ్లున్నాయి. స్నానం చేయి. ముందు నీకు వడ్డించాలి. వేడిగా తినటం అలవాటు నీకు. చల్లారితే అన్నీ వదిలేస్తావు. మడిబట్ట ఆరింది. స్నానానికి తువాలా యిదుగో''.

శేషమాంబ ఉమ వంక మిర్రి చూసి తల్లివేపు నడిచింది. ఉమ కళ్లు తుడుచుకుని, ''మీరు నాకు ఆడబడుచవుతారని అన్నారే మీ అన్నయ్య'' అన్నది నవ్వుతూ.

అక్కడ కడగొట్టు కూతురు లలిత జబ్బు పడిందనీ తీవ్రమై ఆశ వదులుకున్నారని యెలాగో బతికిందనీ విన్నది లలిత పింతల్లి రాజ్యలక్ష్మి. చూసి పోదామని పెద్దక్క బంగారమ్మ వద్దకి వచ్చింది. లలితని చూసింది.

''యెంత తీసేశావే లలితా? వేవిళ్లు గూడానా? బాగా పాలిపోయావే. బిడ్డకి మూడోయేడు వచ్చిందీ? దగ్గరైందేమో అల్లుడు వైద్యుడుగా మందివ్వలేదూ?'' వీపు మీద రాస్తూ మంచం మీద కూచున్నది.

పింతల్లినీ అక్కయ్యా అనటమే అలవాటు చేశారు లలితకి. ''ఇచ్చారక్కయ్యా. అవి నా మీద వేరే రకంగా పనిచేశాయి. అని రాని నవ్వు నవ్వింది లలిత. ''వేవిళ్లేమో అనుమానంగా వున్నదండీ'' అన్నా. మరీ బలహీనమైనావు అంత దగ్గరగా వస్తే కనలేవు. ఈ మందులు వాడు. కొనక్కర్లేదు'' అన్నారు. మరీ మంచిది తొమ్మిది నెలలు మోయక్కర్లేదని మందులు మింగేశా. వికటించి ప్రాణం మీదికి తెచ్చినై''.

''వాడి చేతులు పడిపోనూ? అదేం ఆలోచనే? ముత్యాలంటి బిడ్డల్ని అనాయాసంగా కంటుంటే వెగటైందా? యెక్కడో దూరతీరాన వుద్యోగరీత్యా వెళ్తూ యిదేం పనీ! వుండు తల దువ్వతా'' అని లేచింది రాజ్యలక్ష్మి.

''అక్కయ్యా! నీకు యిష్టమని కంచుగ్లాసూ, సత్తు తప్పేలా కొని తెచ్చా. వాకిట్లోకి వచ్చాయి. ఆ గ్లాసుతో మంచి నీళ్లు తాగు. సత్తు తప్పేలాతో చారుపెట్టినా, పప్పుచారు వండినా చాలా రుచి అన్నావు. అందుకని తెచ్చాను. నా మీదభిమానముంటే వాడుకో. అభిమానం లేకపోతే కాలవలో పారేయి. సుబ్బలక్ష్మికియ్యకు. పింతల్లి అని గౌరవం లేకుండా యెన్ని మాటలన్నదీ? నోటికొచ్చినట్లనేయటమే? పిన్నా పెద్దా గమనించక్కర్లేదా?'' అని కళ్లు తుడుచుకున్నది రాజ్యలక్ష్మి.

పెత్తల్లి బంగారమ్మ వోదార్పుగా అన్నది. ''స్నానం చేయమ్మా రాజూ. సుబ్బలక్ష్మికి నే చెప్తాలే. నోరు హద్దులో వుంచమని. మహా దుడుకు సుబ్బలక్ష్మి. నువ్వు వస్తున్నావని కార్డు ముక్క అందగానే నీకిష్టమైనవి చేశా. కొత్తిమేర కారం, పప్పు చారూ, యెర్రప్పడాలు నిప్పు మీద కాల్చి నెయ్యి రాచాను. మిరపపళ్లు నూరి మినప్పప్పు వడియాలు వేయించాను. కరకరలాడుతున్నాయి. కొత్తపళ్లు కొత్త పప్పు. లేమ్మా'' అన్నది నిలబడి.

రాజ్యలక్ష్మి కొంగుముడి విప్పి పసుపు కుంకుమ పొట్లాలు తీసి పట్టుకుని రవిక వూడదీసి దోపుకుని పాత చీర అందుకుని స్నానానికెళ్లింది.

''లలితా చారూ అన్నం, ఉసిరిక పచ్చడీ, పాత నిమ్మకాయ వూరగాయా వేసుకుని అన్నం తింటే నాలుక్కి రుచి వస్తుంది. జీర్ణశక్తి మెరుగవుతుంది. ఇవాళ మజ్జిగ అన్నం తిందువుగాని. వదినతో పాటు యిక్కడే తింటావా వంటింట్లోకి వస్తావా? పిల్లలు, శేషు అక్క అన్నం తిని వెళ్లారు. అక్క రాత్రి భోజనం వేళకి వచ్చేస్తానని చెప్పి పిల్లల్ని తీసికెళ్లింది.

''వదినింకా రాలేదే?'' అన్నది లలిత.

''అది సాయంకాలం నాలుగున్నరకి వస్తుందేమో! యివాళ ఓ గిన్నెలో భోజనం మరోదాంట్లో టిఫినూ సద్ది సంచీలో పెట్టుకెళ్లింది''.

''అయితే వంటింట్లోనే తింటా'' అని లేచింది లలిత.

5

పొద్దూ కింది ఇంకా దీపాలు పెట్టలేదు. ఉమ లెక్కలు చేస్తుంటే లలిత దగ్గర కూచుని చూస్తున్నది.

పిల్లలిద్దరూ వచ్చారు. ''అమ్మమ్మా. రెండు పావురాలు అందమైనవి ఆయాసపడుతూ వచ్చి వాకిట్లో పడిపోయాయి'' అన్నారు. ''రా. చూడు''.

బంగారమ్మ పిల్లల వెంటవెళ్లి చూసింది. పడిపోయిన పావురాలను బుట్టలో వుంచి లోపలికి తెచ్చింది. వాటికలవాటైన ఆహారం పెట్టింది. పళ్లెంలో నీళ్లు పోసి నేలమీదుంచింది. ముక్కు ఆనిస్తూ తాగినై. బలం చేకూరి, మెడ ఆడిస్తూ తిరిగాయి.

''పారి పోవూ అమ్మమ్మా? యెగిరిపోవూ?'' రఘు అడిగాడు.

''పోవురా నాయనా. అవి పెంపుడు పావురాలు. మామయ్య నేనూ యిల్లు మారినప్పుడవి యింట్లో లేవు. యెటో అడివిలోకి యెగిరిపోయాయి. అప్పటినించీ రాలేదు. యెవరో ఆదరించారు కాబోలు అనుకున్నాం. కాని తిరిగి తిరిగి మేము కనబడక, యెవరూ ఆదరించక బెంగపడ్డాయేమో పిచ్చి కట్టెలు. తిరిగి వెతుక్కుంటూ వచ్చి వుండాలి. మామయ్య వచ్చి వాటి కాళ్లూ ముక్కు తుడిచి పెట్టెలో వుంచి గోడకు వేలాడదీస్తాడు. పెట్టెకు అరలుంటాయి తలుపులకి కన్నాలుంటాయి. మరో రెండు పావురాలుండాలే! అవీ మెల్లిగా వెతుక్కుంటూ వస్తాయేమో'' అన్నది.

పిల్లలు వాటిని పట్టుకోవాలని చూస్తే అందకుండా తిరిగాయి. బంగారమ్మ ఒక మూకుడులో సన్నని వూకపోసి నింపి మధ్యలో చిన్న గుంట చేసి నిప్పు రవ్వ వేసి మూలగా వుంచింది. లాంతరు వెలిగించి ఉమ లలిత వద్ద వుంచింది.

''అదెందుకమ్మమ్మా?'' కేశవ అడిగాడు.

'' ఆ పొగ పైకిపోయి పైగా యిల్లంతా కమ్ముకుంటుంది. దోమలు పైన యెగురుతూ పొగకి వూపిరాడక చచ్చి కిందపడతాయి లేదా పారిపోతాయి''.

''పావురాలకి వేడి తాకదూ?''

''అటువేపు వెళ్లదు పొగ. వెళ్లినా కన్నాలున్నాయి గదూ. రెండో వేపు వెళ్లిపోతుంది. పెట్టెలో వుండదు''.

''పెట్టె యెందుకు తాళమెందుకు?''

''గండుపిల్లి వచ్చి దొంగలాగా దూరి పట్టుకుపోకుండా తాళం. పొద్దున తీసి ఆహారం వేసి వదిలేస్తే కాసేపు అలా ఆకాశంలో, చెట్లమీదా షికారు కొట్టి వస్తాయి''.

అన్న వచ్చాడు. పావురాల కాళ్లూ, ముక్కులూ శుభ్రం చేసి గోడకున్న అల్మరలాంటి పెట్టెలో వుంచాడు.

''లలితా డాక్టరొస్తాడు. ఇంజెక్షనివ్వాలి అన్నాడు. నువ్వింకా వాళ్ల సర్జరీకి నడవలేవని నేనే రమ్మన్నా. మంచంమీద కూచో. లే'' అని దొడ్డి వేపు వెళ్లాడు. స్నానం చేయాలి.

రాజ్యలక్ష్మి వూళ్లోకెళ్లి బంధువులను చూసి వచ్చింది. స్నానానికి తయారౌతూ రవిక తీసింది. దోపుకున్నది. వంటినిండా పమిట కప్పుకున్నది. కాని వీపు కనబడుతున్నది.

ఉమ లేచి అన్నీ సద్దేసింది. లాంతరు తీగకు వేలాడదీసింది. నవ్వుతూ వెళ్లి రాజ్యలక్ష్మిని కవ్వించింది. ''రవిక తొడుక్కోండి అత్తగారూ. లలితకోసం యింజెక్షనివ్వాలని డాక్టరుగారొస్తున్నారు. ఆయన వచ్చి వెళ్లాక స్నానం చేతురుగాని''.

చిరు కోపంతో అన్నది రాజ్యలక్ష్మి ''నేనేం డాక్టర్ని కొరుక్కు తింటానా? అంత బావుంటాడా? యెలుగుబంటిలాగా వుంటాడంతేగా! నాకు మర్యాద తెలియదంటున్నావా? నువ్వా నాకు నీతీ మర్యాదా తెలియజెప్పేది! అబ్బో! కోడలా! రాత్రికి శేషు వస్తుందేవ్. మీ సయోధ్య చూస్తా. దాంతో సరసమాడగలవూ?'' అని బుగ్గలు పిండి బుజం మీద తట్టి పక్క తడిక గదిలో కెళ్లింది.

ఉమ నిలబడి ఇంజెక్షనివ్వటం చూసింది. స్పిరిట్ దూది అందుకుని లలిత చేతిదండ మీద రాచింది. మెడిసిన్ ఛెస్టు అందుకుని డాక్టరు వెంట వీధిలో కెళ్లింది. డాక్టరు మోటారుసైకిలెక్కి ఛెస్టు అందుకుని ముందు వైపు భద్రం చేసి వెళ్లిపోయాడు. ఉమ లోపలికొచ్చి, ''నెప్పి తగ్గిందా వదినగారూ? లెక్కలు చేసుకుందామా? సోమవారం నించే పరీక్షలు, యెలా చేస్తానంటారూ? స్టాండర్డ్ వచ్చిందా పాసౌతానా?'' అంటున్నది. వాకిలి వద్ద సుబ్బలక్ష్మి అనే రెండో కూతురూ ఆమె కూతురు చంద్రకాంతా,మనమడు సుందరేశ్వర్, మనుమరాలు చంకలో వున్న ఉషాబాలా కనిపించారు. మెట్లెక్కుతున్నారు.

ఉమ పక్కగా నిలబడి చూసింది. రండి అనలేదు. లలిత కళ్లు మూసుకుని మంచం మీద పడుకుని వున్నది. లాంతరు వేలాడుతున్నది. దొడ్డివేపునించి రాజ్యలక్ష్మి తడిచీర చుట్టబెట్టుకుని వచ్చి చూసింది. చేతులో పొడి చీరా రవికా.

లోపలికొచ్చారు. బంగారమ్మ వంటింట్లోనించి వచ్చింది. ''లలిత యెప్పుడొచ్చిందమ్మా'' అంటూ సుబ్బలక్ష్మి మనుమరాల్ని దింపి నేలమీద కూచున్నది. చంద్రకాంత పెట్టెగోడవారగా పెట్టి సంచి ఆనించి కూచున్నది మనమడు చూస్తున్నాడు. లలిత పిల్లలిద్దరు మామ్మ యింటినించి వచ్చి చూస్తున్నారు.

''లలిత జబ్బు పడింది. అపస్మారకంలోకి పోతుంటే, దగ్గర్లో డాక్టరు లేడని తెచ్చింది వాళ్లమ్మ. జరం తగ్గింది మెల్లిగా కోలుకుంటున్నది. స్నానం చేయమ్మా సుబ్బూ వేడి నీళ్లున్నాయి'' అంటూ మనమరాల్ని దాని పిల్లిల్నీ ముద్దు చేసింది బంగారమ్మ.

రాజ్యలక్ష్మి సుబ్బలక్ష్మి కోరచూపులు చూసుకున్నారు. యెర్రగా చూసుకున్నారు. మరో నిమిషానికి శేషమాంబా వచ్చేసింది. ''చెల్లాయి వచ్చిందే? అల్లుడు రాలేదా కాంతా'' అని పిల్లల్ని ముద్దు చేసింది.

''వచ్చారు అక్కయ్యా. ఈ వూళ్లో రేపు నాటకమున్నది. నాటకాలు వుద్ధరించి పైకి తేవాలని ఆశయంట అల్లుడు గారికి. వానులో వచ్చాము. నాటక

సామాను సౌందర్య భవనంలో యిచ్చి రావటానికి వెళ్లారు. ఆ థియేటర్ యజమానికి అది లాభసాటిగా లేదట అమ్మ జూపుతున్నాడని తెలిసిందిట. అంచెల మీద తీర్చే పద్ధతి మీద కావాలని ఆలోచన. రాత్రికి రారేమో! రేపు వస్తారు''అన్నది చంద్రకాంత.

''చాలా అవుతుందే కాంతా. లక్షల్లోకి వెళ్లింది దాని ఖరీదు సెంటర్లో వున్నది గదూ''.

రాత్రికి భోజనాలైనై. కొందరు అత్తయ్య యింట్లో శయనించారు. మరునాడు పొద్దున స్నానాలు కాఫీలు టిఫిన్లు జరుగుతున్నయి. సుబ్బలక్ష్మి పిల్లలు భర్తా వచ్చారు.

''అమ్మమ్మా రాత్రి అన్నం లేదెవరికీ'' అన్నది యెనిమిదేళ్ల మనమరాలు జానకి.

''చెప్పకుండా వచ్చేసిందక్కయ్యా నీ కూతురు. గిల్లి కజ్జా పెట్టుకుని రైమని వచ్చేసింది'' అన్నాడు సీతాపతి సుబ్బలక్ష్మి భర్త.

''జడ్జీ వుద్యోగమా? జడ్జీ పిల్లలా? నీ వారున్నారుగా వాళ్ల చేతులూ కాళ్లూ విరిగాయా? నోరుబడింది? పిల్లల సాయంతో చేయలేరూ ఉడాయించారా? నేను వేడివేడిగా వండి వారుస్తే గుటుకూ గుటుకూ మింగేస్తారు. మింగటానికే వస్తారసలు నన్ను చూడటానికా? డబ్బు కోసం వచ్చి నక్క వినయం, దొంగ చూపులు, పోతూ పోతూ యేదో పట్టుకు పోతారు'' అని యీసడించింది సుబ్బలక్ష్మి.

''చూశావా అక్కయ్యా? మా వాళ్లప్పుడే వెళ్లిపోయారు నీ కూతురి నోటికి వెరిచి. స్నానం చేయాలి నేను. వేడి నీళ్లున్నాయా?'' అని దొడ్డి వేపు వెళ్లాడు.

సుబ్రహ్మణ్యం అనుసరించాడు. ''బావా నాతో సంప్రతించకుండా యిల్లు బేరం పెట్టకు. నేను మంచి బేరం తెస్తా. సెంటర్లో వున్ది. అది తాతలనాటి యిల్లు. అమ్మటమే మర్యాద గాదు!'' అన్నాడు. తువాలాతో స్నానం చేస్తూ సీతాపతి

అన్నాడు ''నువ్వా నాకు సలహా యిచ్చేది? అంత పరపతి గలవాడివి మేనగోడలకి సంబంధం చూడకపోయావూ? నీ చెయిన్ స్మోకింగూ, కోచ్ సెంటరూ చూసి వస్తారు'' అని పొడిబట్ట కట్టి లోపలికి వచ్చాడు. పీటమీద కూచున్నాడు. కబుర్లాడుతూ నవ్వుతూ అందరూ కాఫీ ఫలహారాలు కానిస్తున్నారు. చంద్రకాంత భర్త రామమోహన్ వచ్చాడు. అందర్నీ పలకరించాడు. నవ్వుతూ అన్నాడు.

''మీరంతా యివాళ రాత్రికి తొమ్మిదన్నరకి మా నాటకానికి రావాలి'' టిఫిన్ తింటున్నాడు. కాఫీ వద్దన్నాడు.

''చంద్రా! యీ కామంచి పళ్లు చూశావా? చాలా తీపి. యెర్రగా యెంత బావున్నాయో! థియేటర్ ముందు భాగాన వున్న చెట్లకు కాస్తే కోసి తెచ్చా. తిని చూడు'' అని పొట్లమిచ్చాడు.

''ఛూ. ఛీ. మేము తినం నాకు సయించవు పుల్లగా వుంటాయి'' అని పొట్లం దొడ్లోకి విసిరేసింది చంద్రకాంత.

''అదండీ వరస, సరసం అదంతా. చంద్రకాంత తెలుగు భాష మీరు విని తీరాలి. 'మీ నాన్నగారు' అనటానికి నీ అమ్మమొగుడు అంటుంది. అంత బాగా మాట్లాడుతుంది చంద్రకాంత. నేను పోవాలి. రాత్రికి వానుతో వచ్చి అందర్నీ తీసికెళ్తా''.

''నాటక సారాంశమేమిటి?'' అనడిగింది లలిత.

''అత్తగారౌతారా నాకు? వర్ణబేధం కల్పితమనీ, ప్రేమకు హద్దులుండవనీ చాటుతారు నాయకీ నాయకులు. యెన్ని అవాంతరాలొచ్చినా ఒకరికొకరు సాయంగా నిలబడి గెలుస్తారు. అలాగే రాజూ పేదా అనే భేదమూ పనికిరాదు. ఫ్యూడలిజం యొక్క యిగో చూపిస్తారు. ఫ్యూడల్ ప్రభువులు బలవంతంగా వర్కర్స్ గా యెలా తక్కినవారిని పేదలను తయారు చేస్తారో, వృత్తిలోకి యెలా దింపుతారో చూపిస్తారు''

''వృత్తి అంటే''

''మీకు తెలియదూ? చదువుకోలేదూ? బాబాయిగారి నడగండి ప్రాక్టికల్‌గా చూపిస్తారు'' అని నవ్వాడల్లుడు రామమోహన్.

''తలకు పోసుకుని వెళ్లాలి. ప్రయాణంలో దుమ్ము, నేడూ రేపూ శ్రమా. యెల్లుండి మళ్లా ప్రయాణం. తీరికవుండదు'' అన్నది అత్తగారు.

''అలాగే కానిస్తా. చాలా బావున్నది ఫలహారం. మా అమ్మ యింత వుప్పుడు పిండి పళ్లెంలో పెట్టి యిస్తుంది. నెయ్యి వేయదు కారప్పొడి, కందిపొడి, అల్లప్పచ్చడీ అసలే యెరగం'' అని లేచాడల్లుడు.

సీతాపతి పిల్లలూ వెళ్లిపోయారు. అతనికాఫీసూ పిల్లలకి బడి. తక్కిన వాళ్లవీ అయాయి. ఉమ, లలితా ఆకులు పారేసి, గ్లాసులూ కప్పులూ కడిగి బోర్లించారు. ఉమ కాగు కింద మంట పెద్దది చేసింది. ''నీళ్లు కాగినై'' అని అరిచింది.

పిల్లలు వాకిట్లోకెళ్లి ఆడుతున్నారు.

అల్లుడికి తలంటి పోస్తున్నదత్తగారు. అటుగా వచ్చిన రాజామణి ఓరగా చూసి అన్నది. ''వాడు పోసుకోలేడూ? చంటి నాన్నా? చిన్న అంగోస్త్రం చుట్టుకుని తలంటు కానిస్తున్నాడు?''

''నీ బోయ్ ఫ్రెండ్సుకి నువ్వు వండిపెట్టటమెందుకూ? వాడిపెళ్లాం లేదు? అల్లుడు కొడుకుతో సమానం. నువ్వసలెందుకొచ్చావిక్కడికీ? వాడిచ్చే ముష్టికోసం గదూ? మా అమ్మను చూడటానికొచ్చావంటే నమ్ముతానా? మీ కొచ్చే అయివేజు మీకు చాలదూ? కొత్తరకం నగలు, పట్టు చీరలెలా వస్తున్నాయీ? పిల్ల పెళ్లీడు కొచ్చింది. ఇంటి వద్ద వదిలి యెలా వచ్చావూ?'' అన్నది. నలుగుపెట్టి నలుగు వలిచి తలరుద్ది నీళ్లు పోసి వళ్లు రుద్దింది.

వారగా చూస్తూ వినబడకుండా గొణిగింది పింతల్లి ''నువ్వూ డబ్బు కోసమే రెండో సంబంధానికి పిల్లనిచ్చావు. బాగానే వదిలిస్తున్నా వల్లుని చేత. నీ మగడిచ్చిన ఆస్తి వున్నదా? యిల్లున్నదా? బాంకులో డబ్బున్నదా? అయిన కాడికన్నీ అమ్మేసి చిప్ప చేతికి తెచ్చుకున్నావు''. తలంటి వుగిసి

తలతుడుచుకుంటూ అల్లుడు లేచాడు. అత్త ముక్కు పుటాలెగరేస్తూ వురిమి చూస్తూ వున్నవీ మన్నవీ వల్లిస్తూ పింతల్లి మీది కెల్లింది.

'' ఉన్న మాటంటే వులుకెక్కువని రేగిపోయావే కూతురా?'' పింతల్లి వెటకారం చేస్తూ లోపలికెల్లిపోయింది. ''నే నివాళే వెల్లిపోతా. నీ అల్లుని కోసం రాలేదు. నాకు నువ్వు వస్తావని గూడా తెలియదు. నోరు హద్దులో పెట్టుకో జారిపడేవు'' అని లోపలికెల్లిపోయింది. ఉమా, లలితా యిదంతా చూశారు.

6

హాలులో సీట్లన్నీ నిండి పోయాయి. పైన ఫాన్లు తిరుగుతున్నాయి. ''పరబ్రహ్మ'' అనే పాట వినబడంగానే ప్రేక్షకులు గోల మానేసి నిశ్శబ్దమైనారు. టెంకాయ కొట్టిన చప్పుడు హార్మోనిస్టు నేపథ్య సంగీతం వాయిస్తున్నాడు. జర్మన్‌మేడ్ తొక్కుడు హార్మనీ. వేళకి నాటకం మొదలై తెర యెత్తేశారు. నటులు చాలా భాగం కుటుంబ సభ్యులే.

నాటకం కన్న మధ్య మధ్య తెర దిగంగానే రామమోహన్ వాయించే స్వంతడబ్బా వినలేక ప్రేక్షకులు నోరు జేసుకున్నారు. ''చాల్లే స్వంత ఘోష వెనక్కెళ్లు నాటకం కానీ''.

''మీకు ఆడపిల్లలందలేదూ? ఆడవేషాలు మగపిల్లలు వేయాలా? సరీగ్గా లేదు మేకప్. వాళ్ల గొంతులే చెపుతున్నాయి మగవాళ్లని. చాలా మంది నాటకరంగంలోకి వస్తున్నారే ఆడవాళ్లు? వాళ్లని పట్టలేక పోయావా?''

రామమోహన్ వినిపించుకున్నట్టు లేదు. చేతులో కాగితం చూస్తూ ప్రేక్షకులను చూస్తూ సోది చెప్పుకెల్లాడు.

''నాటక కళను పైకి తేవాలని ప్రయత్నించే మమ్ములను ప్రోత్సహించాలని వుదారులైన రైల్వే స్టాఫ్ పదివేలు విరాళమిచ్చారు. వారికి కళ విలువ తెలుసు. అమెచూర్ డ్రమెటిక్ యెసోసియేషన్ వారు, మనకు స్వంత హాలు వుండాలన్నారు. వారు శ్రమించి పదిహేనువేల వరకు విరాళాలు సేకరించి యిచ్చారు. హాస్పటల్,

రెవెన్యూ, కల్కక్టరేట్'' అని చెప్పుకెళ్తున్నాడు రామమోహన్.

నేపథ్య సంగీతంతో పాటు ప్రేక్షకుల జోకులు వింటున్నారు ఆడియన్సు. అది వినోద కార్యక్రమమని ఋజువు చేస్తున్నారు.

తెల్లగా సన్నగా పొడుగ్గా వుండి, ఖద్దరు లాల్చీ, పట్టంచుల ఖద్దరు ధోవతీ వుత్తరీయం నల్లని క్రాపు అందమైన మొహం, నొచ్చుకోకుండా చెపుతూనే వున్నాడు రామమోహన్.

''ముందే కళాకారులకు చెల్లిస్తాము. హాలుకీ మేనేజ్‌మెంట్ స్టాఫ్‌కీ ముందే బయానా యిస్తాము. మోసమేమీ లేదు'' నవ్వుతున్నాడు.

''యెందుకుంటుందీ? తొంభైశాతం వాళ్లే. వాళ్లకి పందారం చేశావు అంతేనా?''

''బెగ్గింగ్ బవెల్ పట్టుకెళ్లావా? దాని పేరు వీరముష్టి''.

''నాటకం గూడా మేమే రచించాము. నా తమ్ముడు గొప్ప రైటర్. లేఖలు అని సంపుటీకరించి పబ్లిష్ చేశాము. అవన్నీ దేశ ప్రేమను, దేశ సమైక్యతను వ్యక్తం చేస్తాయి'' అంటున్నాడు రామమోహన్.

''నాటకీయత యేదీ రచనలో? నాటకమే యింత బావుంటే లేఖలెంత బావున్నాయో ఖర్మ'' అని నుదురు కొట్టుకున్నాడో ప్రేక్షకుడు.

నాటకం పూర్తి కావచ్చింది. చివరి అంకమున్నదింకా. తెర దిగంగానే రామమోహన్ తెరముందు నిలబడ్డాడు. యేదో చెపుతున్నాడు.

కొంత మంది ప్రేక్షకులు లేచి వచ్చి రామమోహన్ని రెక్క పట్టుకుని, ''జిడ్డా! నాటకం పూర్తిగానీ! టికెట్టుకు డబ్బు పోసింది వినోదం కోసమా సోది వినటానికా? ఒంటిగంటైంది. నాటకం కన్న నీ డబ్బా వినిపించటానికే యెక్కువ టైమ్ వెచ్చిస్తున్నావు'' అని నవ్వుతూ సైడు కర్టెన్‌వేపు లాక్కెళ్లారు.

పతాకసన్నివేశంలో డిష్యుమ్ డిష్యుమ్ చూసి చప్పట్లు కొట్టారు ప్రేక్షకులు. చివరికి గ్రూప్ ఫొటోకి నిలబడ్డట్టు కళాకారులు స్టేజీమీద నిలబడ్డారు.

రామమోహన్ వారి పేర్లూ వివరాలూ చెప్తుండగా హాలు ఖాళీ అయింది.

7

ఉమ నవ్వుతూ నాటకం గురించి చెప్తున్నది. పొద్దున ఫలహారాలు అయి వంటకుపక్రమిస్తున్నది బంగారమ్మ. బండి ఆగి అందులోనించి పూర్ణిమా, లలిత అక్క పున్నమ్మ, లలిత తల్లీ దిగారు. బండీవాడు మూటలు కింద వుంచి బాడుగ అందుకుని వెళ్లిపోయాడు.

పిల్లలు ఆడుకుంటున్నారు. చెట్ల ఆకుల సందునించి సూర్యకిరణాలు దూరి వచ్చి వారి మీద పడుతున్నాయి.

'పూర్ణా! యిడ్లీ వున్నది, దోసె వున్నది, అట్టు వున్నది. కాఫీ వేడిగా వున్నది. స్నానం చేయాలా?'' అన్నది బంగారమ్మ.

'' ఏమక్కర్లేదక్కయ్యా! అమ్మ నన్ను నిద్రబోనీకుండా లేపి స్నానం చేయించి బయలు దేరదీసింది. తినేందుకు దోవలో గూడా యేం పెట్టలేదు. నాకు శోష వచ్చింది. కళ్లు తిరుగుతున్నాయి అక్కయ్యా'' అని నేలమీదికి ఒరిగింది పూర్ణిమ.

ఉమ కూర తరిగింది. బియ్యం యేరి చాట అవతలుంచింది. పూర్ణచంద్రుడల్లే, రుక్మాంగదునికి వుయ్యాల వూగుతూ వనంలో కనిపించిన మోహినిలాగా వున్న పూర్ణిమను చూస్తూనే ఓసారి పక్కకి చూసింది. పక్క గదిలో పూర్ణిమ తల్లి అటు తిరిగి కూచుని నోట్లు లెక్కిస్తున్నది. పక్కనే చీరలు కుచ్చీలు పోస్తున్న బట్టలు తాకటానికి తయారవుతున్న బంగారమ్మ రెండో కూతురు మెల్లిగా అడుగుతున్నది.

'' ఓ వంద అప్పు యివ్వవే అక్కయ్యా. తీరుస్తానూ. చంద్రికి కొత్త బియ్యపు అన్నం పడక కడుపు నెప్పి పొట్ట వుబ్బరం వచ్చింది. పాత బియ్యం కొని తెచ్చి దానికి వేరే వండుతా. అల్లునికి పిండివంట చేయాలి. పిల్లలకి కొత్త గుడ్డలు కొనాలి''. పున్నమ్మ సంచీ మూసింది. వందనోటు అక్క

కూతురుకిచ్చింది.

పూర్ణిమ ఇడ్లీలు తిని ''బెడ్ కాఫీ అలవాటు. యింతమటుకు పొట్టలో కాఫీ పడలేదివాళ'' అని కప్పు నిండా కాఫీ డికాషన్ వేడిది పోసి తాగేసింది. దోసెలు రెండు తిన్నది. అట్లు రెండు తిన్నది, పాలు పంచదారా నేనే వేసుకుంటా నక్కయ్యా నీ నీళ్ల కాఫీ నాకు సయించదు'' అన్నది. బంగారమ్మ పాలూ పంచదారా తెచ్చి అక్కడ పెట్టింది.

'' ఇన్నెందుకు చేశావివాళ అక్కయ్యా? అన్నీ బావున్నాయి. ఇవాళేమన్నా పండగా''.

''బంధువులొచ్చారని చేశా పూర్ణా'' అని లోపలికెళ్లింది. ఉమ బియ్యం కడిగి వడేసి తెచ్చి పక్కగా పెట్టింది.

''నువ్వెవరే జంగాలమ్మాయిలాగా వున్నావే? యెవరైతే నాకెందుగ్గానీ నేనేమైనా తినేప్పుడిటు రావోకు. దిష్టి పెడతావు నాకు కడుపు నెప్పి వస్తుంది. మీరంతా తినలా పొట్ట పగిలేట్టు'' అంటూ లేచింది. గ్లాసులూ, కప్పులూ దొడ్లోకి విసిరేసింది. యెండు తామరాకులు యెంగిలాకు వీధిలో పారేయాలని లేచింది పూర్ణిమ. ''వద్దమ్మా అంటే వింటేనా? పొద్దున్నే తలారా స్నానం. తలారక ముందే తడితలతోనే ప్రయాణం. ముక్కు బిగేసింది. చచ్చిపోతున్నా'' అంటూ వీధిలో కెళ్లింది. తలముడి విప్పి ఆరబెట్టుకోవాలని. ఆకులు విసిరేసింది. అవిపోయి అత్తయ్య యింటి మీద పడ్డాయి. పిల్లలు నవ్వారు. జుట్టు కిందికి దిగి మోకాటి పల్లం వరకు పడింది. ఉమ నించుని చూసింది. సుబ్రహ్మణ్యం వచ్చి వార్నింగిచ్చాడు.

'' ఉమా! దాన్ని రెచ్చగొట్టకు. నోరు విప్పిందంటే మూతపడదు. నీ దోవన నువ్వు వెళ్లు. ఇవాళ ఆదివారం గదూ మరిచాను. బాగా రాశావా పేపర్లు?'' అని లోపలికెళ్లాడు. త్రేనుస్తూ యెడం చేత్తో పొట్టమీద రాచుకుంటూ అరుస్తూనే వున్నది పూర్ణిమ. కొంతసేపటికా అరుపులు అందరిగుట్టూ బయటబెడుతూ లావాలాగా ప్రవహించినయ్యి. శృంగారంలోంచి వచ్చి శృంగారంలోకి నడిచి

బూతుల్లోకి పోయింది.

పున్నమ్మ చీపిరి తెచ్చి వీపు మీద బాదసాగింది. రాజామణి చెల్లెలు వచ్చి చీపిరిలాక్కుంది. ''నీ చేతులు విరిగిపోనూ! జమిందారింట్లో పుట్టాల్సిన పిల్ల. నీ కడుపున పుట్టింది. మొగుడు, కొడుకూ, ఆస్తీపోయి నీకు లోకువైందా?'' అన్నది.

''అబ్బో ఆవిడా అక్కయ్యా! పైనించి వూడిపడ్డాననుకుంటుంది. పత్తిత్తు ననుకుంటుంది. పెద్దగా అరుస్తూ తాను సౌశీల్యం కాపాడుకున్నాననీ, ధనాశలేదనీ చెప్తుంది. సరీగ్గా దానికి వ్యతిరేకమని నా అభిప్రాయం. హెడ్ స్ట్రాంగ్ వడ్డీ లెక్కలు, అమ్మకం కొనుగోలు లావాదేవీలు తప్పితే మరో మాట నోటి వెంటరాదు. వాళ్ల నాయనగారు ఆస్థానవిద్వాంసుడట. అదో గర్వం. కాని విద్వాంసుడు స్త్రీ హత్య చేశాడు. నలుగురూ కలిసి వీళ్ల నాయనగార్ని ఉరికంబం యెక్కించక తిమ్మిని బ్రహ్మిని చేసి కేసుపైకి రాకుండా చేశారు. నేనప్పుడుండివుంటే అది ఫస్ట్ డిగ్రీ మర్డరేనని చాటిచెప్పి వూరి మధ్య వురి తీయించేదాన్ని''. కళ్లు పెద్దవై, యెర్రబడినై పూర్ణిమకు. ''రెండోది అసత్యమే. డబాయిస్తే సరా? ఇదుగో నా చెల్లి. దీని మొగుడు దగాకోరు దగుల్బాజీ. ఈమెకు తెలిసే, కాసులు కురిపిస్తాడని రానిచ్చింది. కానీ కుక్కాశ గుండ్రాయితో తీరినట్టు అయింది. దాంతో వీధిన బడి, వూళ్ల వెంట తిరిగి యాగీ చేసి రాబట్టిందనుకో. అహహా! యేదో యెంగిలి చేయి విదిలించాడా కాసులుగల రాజు. నేనందుకే వాడి భరతం పడదామని చెలిమి చేస్తే అదో పెద్ద తప్పుగా రగడ చేసింది. మీ అప్పేగా'' అలా అరుస్తూ కుట్రలు, కుహకాలు లావాలాగా వదిలింది. ''వాళ్ల నాయనగారి స్థలం యిది. పెద్ద కూతురు చివరివరకు సేవచేసి భిక్ష పెట్టిందనీ ఆమె పేర రాశాడు''. అక్కడున్నవారు వినోదం చూస్తున్న వారడిగారు. ''భిక్షయెందుకూ? సన్యసించారా ఆమె నాయనగారూ?''

''అదే తెలియదా? మోక్ష ప్రాప్తి కోసం సన్యసించారు వీళ్ల నాయనగారు. సన్యాసమనే యెర్రజెండా చూసి కర్మ అనే రైలు ఆగదు. లోకం కన్ను గప్పటానికా

తతంగం వేషమూనూ. గురువు వేషం వేస్తే గురువౌతాడా? అన్నాడు రావూనుజుడు. అహంకార మమకారాలు పోలేదు. రాగద్వేషాలను జయించలేదు. ఈర్ష్యాసూయలూ వదల్లేదు సన్యాసి మేథమెటీషియన్‌కి'' అలా అరుస్తూనే జుట్టు గాలికెగురుతుండగాచాలా రహస్యాలు యేనాటివో కక్కసాగింది. కొంతమంది నించోలేక వెళ్లిపోయారు. మరికొందరు తమనే కడుగుతున్నదని వెళ్లిపోయారు. మిగిలినవారు వంటచేసుకోవాలనీ, యితరపన్ల మీదా వెళ్లిపోయారు.

## 7

పూర్ణిమ నోటి ధాటికి తట్టుకోలేక బంధువులు వెళ్లిపోయారు. లలిత పొద్దెక్కి యింటికి వచ్చింది. ఉమ మంచం నీళ్లు పోసి కడిగి యెండలో నించోబెట్టింది. సవరాలు రెండు కుంకుడు నురుగుతో క్లీన్‌చేసి వేడినీళ్లతో కడిగి చెట్టు కొమ్మమీద ఆరేసింది. తాను స్నానం చేసి మంచి బట్టలు కట్టుకుని తలకు పిడప వేసుకుని నీళ్ల కాగు కింద మంట ఆర్పేసింది. భోజనం వేళౌతున్నది. లలితను చూసింది.

''యెక్కడికెళ్లారు వదినగారూ? పిల్లలిద్దరూ మీ కోసం వెతుక్కున్నారు. అమ్మమ్మగారితో చెప్పి వెళ్లలేదూ'' అన్నది.

లలిత వచ్చి మెట్టు మీద కూచున్నది. ''మంచం కడిగావేం''.

''చెప్పాను వదినగారూ. అక్కయ్యకు తెలుసుగూడాను. ఇల్లు వెతుకుదాము చిన్న భాగమున్నదేమోనని కనిబెడదామని తిరుగుతున్నారు''. చంద్రకాంత స్నానం చేసి మైలమంచం కడక్కుండా '' ఇల్లెందుకు? ఇక్కడుండరూ? నేనున్నానని వెళ్తున్నారా? వెళ్లిపోయింది. సవరాలు తల్లి కూతురువీను. అవీ కడక్కుండానే వెళ్లిపోయారు''.

''నేను వెళ్లిపోతా. శలవు పెట్టి వచ్చాను. పరీక్షలు మీ దయవల్ల బాగా వ్రాశాను. తోడుగా వుండి సాయం చేశారు. మళ్లా జాబ్‌లో చేరాలి. పేపర్లు

దిద్దినవారూ, వాచర్లు మీ అన్నగారికి అదే మామయ్యగారికి తెలుసు పరీక్ష బాగానే రాసింది. పాసౌతుంది అన్నారుట. మామయ్య చెప్పారు. వున్న కాసిని రోజులు నరకం చూశారనుకుంటా'' అన్నది ఉమ పక్కన కూచుంటూ.

''కాదు. కాదు వదినగారూ స్వర్గం చూశాను. యెంత ఆపేక్షపచ్చం పానం అమిర్చి పెట్టటమే గాక నా పిల్లల్ని గూడా ఆపేక్షగా ముద్దుగా చూశారు అక్కయ్యా మీరూనూ. నేను తెచ్చుకున్నదై పోయింది. చెక్ వస్తుందేమోనని యెదురు చూస్తున్నా రాలేదింత వరకు. బాగా నయమైంది. లేచి తిరుగుతున్నాగా? పిల్లాడి చిన్న గొలుసు తెగింది. పోకముందు దాన్ని అమ్మి డబ్బు చేతామని ఆపని పూర్తి చేశా. ఇల్లు అందింది. అంత సౌకర్యంగా లేదనుకోండి. అద్దె తక్కువ. మెల్లిగా రఘుని బడికి పంపాలిహ. నేనూ యేదైనా టెక్నికల్ కోర్సుకి అప్పియరౌదామా అని ఆలోచిస్తున్నా. కంప్యూటర్ కోర్సని నేర్పుతున్నారు''.

''యెందుకనీ? నెలలు గదూ? ఈ వూళ్లో యిల్లున్నదన్నారే?'' అన్నది ఉమ. ఇల్లు అంటే అత్త వారిల్లు.

''అన్నారుగానీ హక్కులేదు. మా అక్క అగ్ని పర్వతంలాగా అయి వెలిగక్కిన లావా విన్నారుగా?''

''మీ అమ్మగారు డబ్బు తెచ్చారే?''

''లోకం పోకడ తెలియనట్టు నటిస్తున్నారేమో వదినగారూ''.

''ఆ డబ్బు తన ప్రైవేట్ ఎంటర్‌ప్రైజెస్‌కి వాడుతుంది. అక్క ఐవేజు అక్క మందులకీ, ట్రీట్‌మెంట్‌కీ వాడుతుంది. దేవుని దయవల్ల యివతలికి వచ్చాను. ఈ అవకాశం వదులు కోకుండా విడిగా వుంటే నాకా లావా వినే బాధ తప్పుతుంది వదినగారూ. విన్నారుగా రాగం? కాకుల్ని కొట్టి గద్దలకు విసిరినట్లు, కూతుళ్లను దోచి కొడుకులను పోషించుకుంటుందిట తల్లి. నేనూ వాడికే కంటానంటే వినవేమే లలితా? మళ్లా పరాయివాడెందుకు? వాడూ చస్తాడేమో? నీ మాంగల్య బలిమి వల్ల వీడు బతికి వుంటాడంటే వినిపించుకోవేమే చెల్లెలా?'' యేం

బాగుందిలా వదినగారూ. దేనికైనా లిమిట్ వుండాలి. ''నీకు మాంగల్యం లేదనుకో. కట్టనన్నాడనుకో. అదీ మన మేలుకే. నీ సొమ్ము మేమూ తినచ్చు. తెచ్చి చేతులో పోస్తున్నాడుగా'' అలా అంటుంది. స్వయంగా విన్నారుగా వదినగారూ ? స్వంత వదినల్లే కనబడితే చెప్పుకుంటున్నా. అందుకే స్వర్గంలో వున్నట్టున్నదన్నాను''.

''నాకూ అంతేనండి వదినగారూ. స్వంత ఆడబడుచులాగా కనిపించారు మొదటే. మీరంటే తక్కినవన్నీ ఆటలాగా తోచాయి. నాకూ స్వర్గమనిపించిందండీ'' అన్నది ఉమ.